ఈ-పేపర్ తెలుగు డైలీ 8PM

# ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL

https://epaper.eyyaltynews.in/

గురువారం, జూన్ 11, 2026

# గోల్నాక వీరన్న గుట్టలో స్కూల్ రీ-ఓపెనింగ్..

## చిన్నారులతో మొక్కలు నాటిన హరితసేన

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్‌పేట, జూన్ 11:** బడిబాట ప్రారంభోత్సవం సందర్భంగా గోల్నాక డివిజన్‌లోని వీరన్న గుట్టలో ఉన్న పాఠశాల పునఃప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలకు వచ్చిన చిన్నారులతో కలిసి నాయకులు పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ.. ప్రస్తుతం పెరుగుతున్న కాలుష్య నివారణకు, ప్రపంచ పర్యావరణ పరిస్థితులను కాపాడటానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చిన్నతనం నుంచే పిల్లల్లో పర్యావరణంపై బాధ్యతను పెంచాలనే ఉద్దేశ్యంతోనే ఈ కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ పర్యావరణ చైతన్య కార్యక్రమంలో గోల్నాక డివిజన్ హరితసేన అధ్యక్షులు ఏ. సురేష్ గౌడ్ , బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆర్కే బాబన్న, హరితసేన అంబర్‌పేట నియోజకవర్గ అధ్యక్షులు నిరంజన్ పూలే,



నాయకులు నల్లగొండ నరేందర్ , రాచకట్ల శ్రీనివాస్ , సాయిరాం గౌడ్ , ఎస్. శివ , రుద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



నవంబర్‌లనే గ్రేటర్ల 'ఓట్ల పండగ'!

దసరా ముగియంగనే మున్సిపల్ ఎన్నికల మోత..

2



హైదరాబాద్ పోలీసుల భారీ ఆపరేషన్..

రూ.5వేల కోట్ల స్కామ్‌కు చెక్!

2



కాంగ్రెస్ 'మాస్టర్ ప్లాన్'..

ప్రియాంక గాంధీకి కీలక బాధ్యతలు!

2



ఒక్కడే మొగుడు..

39 మంది పెండ్లాలు..!

2వందల మంది పిల్లలు... తినడానికే రోజుకి...?

3




గోల్నాకలో బాలాజీ మంగల్ బండార్



ఈగలు ముసిరిన అపరిశుభ్ర వాతావరణంలో చాట్ తయారీ

# డ్రైనేజీ మ్యాన్‌హోల్‌పై పానీపూరి దందా..

- తిన్న చిన్నారికి ఫుడ్ పాయిజన్..!
- అంబర్‌పేటలో దారుణం..
- గల్లీ గల్లీలా ఇదే తంతు..
- ఈగలు ముసురుతున్నా పట్టించుకోని ఫుడ్ సేఫ్టీ 'సార్లు'!

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూన్ 11:**

లొట్టలేసుకుంటూ తినే పానీపూరి.. ప్రాణాల మీదకు తెస్తోంది. నోరూరుంచే చాట్ బండ్లు.. రోగాల పుట్టలుగా మారుతున్నాయి. అపరిశుభ్ర వాతావరణంలో, డ్రైనేజీ గుంతల పక్కన పెడుతున్న బండ్ల తిండి తిని జనాలు దవాఖానల పాలవుతున్నారు. తాజాగా అంబర్‌పేటలో మూడేళ్ల చిన్నారి అపరిశుభ్రమైన పానీపూరి తిని తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన స్థానికంగా కలకలం రేపింది.

### అసలేం జరిగిందంటే..?

అంబర్ పేట ఆజాద్ నగర్‌కు చెందిన జక్రియా అనే వ్యక్తి నిన్న 10వ తేదీ (బుధవారం) సాయంత్రం 'చే నెంబర్ చౌరస్తా' నుంచి 'జిందా తిలిస్మాత్' వెళ్లే దారిలో ఉన్న ఒక పానీపూరి బండి వద్ద ఇంటికోసం పార్సెల్ తీసుకువెళ్లాడు. ఆయన మూడు సంవత్సరాల



డ్రైనేజీ మ్యానల్ మూతపై స్టాల్

కూతురు 'హుదా' ఎంతో ఇష్టంగా ఆ పానీపూరి తిన్నది. తిన్న కొద్దిసేపటికే ఆ చిన్నారికి కడుపుల తిప్పేసి, వరుసగా వాంతులు, విరోచనాలు కావడం మొదలయ్యాయి. పసిపిల్ల విలవిలలాడిపోతుంటే కంగారుపడ్డ తండ్రి.. వెంటనే ఆ పానీపూరి బండి యజమానిని నిలదీశాడు. అయితే, ఆ యజమాని బాధ్యత లేకుండా "మా దగ్గర గట్లనే ఉంటది..అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు.

### మ్యాన్‌హోల్ పైనే బండి.. ఈగల ముసురు!

బాధిత తండ్రి పానీపూరి బండి వద్దకు వెళ్లి చూస్తే అక్కడి పరిస్థితి ఘోరంగా ఉంది. కంపు కొట్టే ఒక డ్రైనేజీ మ్యాన్‌హోల్ మూత పైనే ఆ పానీపూరి బండిని పెట్టారు.

దాని చుట్టూ ఈగలు ముసురుతున్నాయి. కనీస శుభ్రత లేకుండా, మురికి నీళ్ల పక్కనే పానీపూరి నీళ్లను తయారు చేస్తున్నారు. గిలాసలు, ప్లేట్లు కడిగే నీళ్లు కూడా అపరిశుభ్రంగా ఉన్నాయి. ఇలాంటి కలుషితమైన తిండి తినడం వల్లే ఆ పసి ప్రాణం ఇవాళ దవాఖాన బెడ్డుకెక్కింది.

### రోడ్లపై.. గల్లీ గల్లీలా ఇదే కథ..

అంబర్‌పేట నియోజకవర్గంలో ప్రతి గల్లీలోనూ ఇదే తంతు నడుస్తోంది. డ్రైనేజీ కాలువల పక్కన, చెత్త కుప్పల పక్కన ఎలాంటి పర్మిషన్లు లేకుండా వందల సంఖ్యలో పానీపూరి, చాట్ బండ్లు వెలుస్తున్నాయి. వీటిపై ఎలాంటి నిఘా లేదు. కలర్ల కోసమో, రుచి కోసమో వాడుతున్న కెమికల్స్ జనాల పొట్టలు కొడుతున్నాయి.

### ఫుడ్ సేఫ్టీ సార్లు ఏం చేస్తున్నారు..?

అంబర్ పేటలో ఇంత జరుగుతున్నా.. ఫుడ్ సేఫ్టీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఎక్కడో పెద్ద పెద్ద హోటళ్ల మీద నామ్‌కే వాస్తే రైడ్లు చేసే అధికారులు.. గల్లీ ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్న ఇలాంటి అపరిశుభ్రమైన బండ్ల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నిద్ర లేవాలని, అంబర్‌పేట ఏరియాలో ఉన్న పానీపూరి బండ్లపై తనిఖీలు చేసి, కఠిన చర్యలు తీసుకోకుంటే ప్రజల ప్రాణాలు గాల్లో కలవడం ఖాయమని హెచ్చరిస్తున్నారు.

# పీఎం మోదీతో సీఎం రేవంత్ దోస్తానా..

## మెట్రో పైసలు ఇయ్యాలె.. 'పాలమూరు' ముచ్చట తేల్చాలె!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 11:**

ఢిల్లీ టూర్లో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ఇయ్యాల 'నీతి ఆయోగ్' మీటింగ్ ముగియగానే సాయంత్రం ప్రధాని నరేంద్ర మోదీతో విడిగా ముచ్చట పెట్టారు. తెలంగాణ డెవలప్‌మెంట్ గురించి ఈ ఇద్దరు నేతలు సుదీర్ఘంగా చర్చించుకున్నారు. రాష్ట్రానికి రావాల్సిన పైసలు, పెండింగ్ పనుల పంచాయితీని రేవంత్ రెడ్డి పీఎం ముందు పెట్టారు. తెలంగాణ రవాణా రంగానికి, ఇండస్ట్రీలకు పెద్ద దిక్కుగా మారబోతున్న 'రీజినల్ రింగ్‌రోడ్డు' పనుల ముచ్చటను సీఎం రేవంత్ ప్రధానికి విడమరిచి చెప్పారు. ఈ ప్రాజెక్టును జల్దీ జల్దీ నడిపించాలంటే కేంద్రం నుంచి రావాల్సిన నిధులను వెంటనే విడుదల



చేయాలన్నారు. దీనితో పాటు మన ప్రతిష్టాత్మక 'భారత్ ఫ్యూచర్ సిటీ' నుంచి ఆంధ్రాలోని మచిలీపట్నం పోర్టు వరకు అనుకున్న '12 లెన్ ఎక్స్‌ప్రెస్ వే' నిర్మాణ కేంద్రం గట్టిగా సపోర్ట్ ఇయ్యాలని విజ్ఞప్తి చేశారు.

గ్రేటర్ హైదరాబాద్‌ల ట్రాఫిక్ కష్టాలు తీరాలంటే మెట్రో విస్తరణ ఒక్కటే మార్గమని సీఎం రేవంత్ అన్నారు. అందుకే హైదరాబాద్ మెట్రో రైల్ సెకండ్ ఫేజ్ పనులకు కేంద్రం తన వాటా పైసలను, అవసరమైన ఫండ్స్‌ను వెంటనే చేయాల్సి ఉంటుంది. ఇక హైదరాబాద్ సిటీ రూపురేఖలను మార్చేందుకు తాము పట్టుబట్టిన 'మూసీ నది ప్రక్షాళన' మొత్తానికి ఢిల్లీ టూర్‌ల సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రాజెక్టుల కోసం గట్టిగానే పట్టుబట్టినట్లు పొలిటికల్ సర్కిళ్లలో గరం గరం చర్చ జరుగుతోంది.

# 550 జీవో ద్వారానే మెడికల్ సీట్లు భర్తీ చేయాలి...

## హెల్త్ మినిస్టర్ దామోదర్ రాజనర్సింహకు ఆర్.కృష్ణయ్య వినతి..



**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూన్ 11:** రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, మెడికల్ కోర్సులో బలహీన వర్గాల విద్యార్థులకు జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిశారు. ఈ మేరకు బీసీ సంఘం నాయకులతో కలిసి మంత్రికి ఒక వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎంబీబీఎస్, పీజీ తదితర కోర్సుల సీట్ల భర్తీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అర్హులైన రిజర్వ్ వర్గాల విద్యార్థులకు సీట్లు దక్కకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటన్నింటికీ పరిష్కారంగా 550 జీవో నిబంధనల ప్రకారం మెడికల్ సీట్ల కౌన్సిలింగ్, భర్తీ ప్రక్రియను చేపట్టాలని, అప్పుడే నిరుపేద వెనుకబడిన విద్యార్థులకు న్యాయం జరుగుతుందని మంత్రికి వివరించారు.

మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, విద్యార్థుల సమస్యలను పరిశీలించి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల ముదిరాజ్ దేవ్ యాదవ్ తో పాటు పలువురు బీసీ సంఘాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# బీజేపీ అంబర్‌పేట కోర్ కమిటీ మీటింగ్..

## బూత్ లెవెల్ నుంచే గెలుపు కోసం కొట్లాడాలి!

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూన్ 11:**

అంబర్ నియోజకవర్గ బీజేపీ కోర్ కమిటీ సమావేశంజరిగింది. హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి ఏడెల్లి అజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్. గౌతమ్ రావు ముఖ్య అతిథిగా హాజరై...

రాబోయే రోజుల్లో పార్టీ చేపట్టబోయే కార్యక్రమాలు, బూత్ స్థాయిలో కార్యకర్తలు చేయాల్సిన పనులపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌతమ్ రావు మాట్లాడుతూ.. కేంద్ర నరేంద్ర మోదీ సర్కార్ కొలువుదీరి 12 ఏండ్లు పూర్తి చేసుకున్న శుభసందర్భాన్ని పురస్కరించుకుని, పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు మోదీ ప్రభుత్వం పేదల అభ్యున్నతి కోసం చేసిన సంక్షేమ పనులు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని సూచించారు. ఇక అంర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని, 24 గంటల కౌంట్‌డౌన్‌లో భాగంగా కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి జూన్ 20వ తేదీ ఉదయం 5 గంటలకు ఎల్‌బీ స్టేడియంలో భారీ యోగా కార్యక్రమంలో అంబర్‌పేట నియోజకవర్గ ప్రజలందరినీ ఆహ్వానించి, ఈ యోగా వేడుకలు పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని ఆయన సూచించారు.

రాబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో అంబర్‌పేట నియోజకవర్గ పరిధిలో బీజేపీ కాషాయ పతాకాన్ని ఎగరేయడమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన దిశానిర్ధేశం చేశారు. ఈ సమావేశంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు జి.ఆనంద్ గౌడ్, వీరెల్లి చంద్రశేఖర్, జిల్లా పదాధికారులు కన్నె రమేష్ యాదవ్, శ్యామ్ రాజ్, ఎక్కాల కన్నా, సూర్య ప్రకాష్ సింగ్, మూల రవీందర్ గౌడ్, కార్యవర్గ సభ్యులు కృష్ణాగౌడ్, రాష్ట్ర బీజేపీ స్పోర్ట్స్ సెల్ రాష్ట్ర కన్వీనర్ చిట్టి శ్రీధర్, డివిజన్ బీజేపీ అధ్యక్షులు నాగరాజు చారి, నరేష్ గౌడ్, నాయకులు, శ్రీధర్, బల్వీలతో పాటు నాయకులు ఉన్నారు.

# టీజీపీఎస్సీ దరఖాస్తు ఫీజులు తగ్గించాలె..

## నిరుద్యోగులపై భారం వేయొద్దు - డీవైఎఫ్ఐ డిమాండ్

**ఇయ్యాల్టి న్యూస్, కాచిగూడ, జూన్ 11:** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉద్యోగ దరఖాస్తుల ప్రాసెసింగ్ ఫీజును ఒకేసారి రూ. 200 నుండి రూ. 1000 కి పెంచడం దుర్మార్గమని, దీనివల్ల నిరుద్యోగులపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతుందని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి జావీద్ ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన ఫీజులను ప్రభుత్వం తక్షణమే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు.



ఎంతో కాలంగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ, అప్పులు చేసి కోచింగ్ సెంటర్లలో చదువుకుంటున్న నిరుద్యోగ యువతను ఈ ఫీజుల పెంపు తీవ్రంగా దెబ్బతీస్తోందన్నారు. ఇటీవల టీజీపీఎస్సీ విడుదల చేసిన నోటిఫికేషన్లలో ఉద్యోగాలన్నింటికీ కలిపి ఒకే నోటిఫికేషన్ ఇవ్వకుండా.. వేరువేరుగా జారీ చేయడం వల్ల అభ్యర్థులు ప్రతి దరఖాస్తుకు రూ. 1000 చొప్పున వేల రూపాయలు చెల్లించాల్సి వస్తోందని జావీద్ మండిపడ్డారు.

ఇప్పటికైనా బోర్డు పునరాలోచించి, పెంచిన దరఖాస్తు ఫీజును వెంటనే తగ్గించి నిరుద్యోగ యువతను ఆదుకోవాలని డీవైఎఫ్ఐ తరపున ఆయన డిమాండ్ చేశారు.

# జూలై 1 నుంచి 'వీబీ-గ్రామ్' పథకం..

## తెలంగాణకు 3,825 కోట్లు కేటాయించిన కేంద్రం!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 11:** వచ్చే జూలై 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా అమలు చేయబోయే వీబీ-గ్రామ్ తెలంగాణలో పక్కాగా, సజావుగా అమలు చేయడంపై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఢిల్లీలో జరిగిన ఈ పథకం రూపకల్పన, నిధుల విడుదలపై ఇద్దరు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. ఈ సరికొత్త పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ రోజులను 100 రోజుల నుండి 125 రోజులకు పెంచుతున్నట్లు ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రానికి గాను 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ పథకం కింద 3 వేల 825 కోట్ల రూపాయల భారీ నిధులను కేటాయించినట్లు ఆయన కేటాయించారు.



కాగా..ఈ పథకానికి అయ్యే ఖర్చు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో (కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం) సంయుక్తంగా భరించనున్నాయి. కాబట్టి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వంతు వాటా నిధులను వెంటనే కేటాయించి, సకాలంలో నోటిఫికేషన్ విడుదల చేసింది, తద్వారా గ్రామాల్లోని పేదలకు జూలై 1 నుంచి లబ్ధి చేకూరేలా చూడాలని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి సూచించారు.

## ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులుగా

# ఈరెంటి విజయ్ మాదిగ

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్‌పేట, జూన్ 11:** మాదిగ స్టూడెంట్స్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థి నాయకుడు ఈరెంటి విజయ్ మాదిగ నియమితులయ్యారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఊసూరుపాటి బ్రహ్మయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు చిటుపాక ప్రభాకర్ మాదిగ ఈ మేరకు విజయ్ మాదిగకు నియామక పత్రాన్ని అందజేశారు.



ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.in/

# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్‌లు

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 11:** పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా ఇయ్యాల ట్రేడింగ్‌లో భారత ఈక్విటీ మార్కెట్‌లు నష్టాలతో ముగిశాయి. ఇరాన్ పై అమెరికా తన సైనిక చర్యను తీవ్రతరం చేసిందనే వార్తలతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలహీనపడింది. రోజంతా ఒడుదొడుకులకు లోనైన సూచీలు చివరికి నష్టాలు మూటగట్టుకున్నాయి. సెన్సెక్స్ 150.63 పాయింట్లు నష్టపోయి 73,832.55 వద్ద, నిఫ్టీ 53.35 పాయింట్లు తగ్గి 23,161.60 వద్ద ముగిశాయి. ఇరాన్‌కు తగినంత సమయం ఇచ్చినా చర్చలకు రాలేదని, ఇప్పుడు పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్‌పై తీవ్రంగా దాడి చేస్తామని ఆయన స్పష్టం చేయడంతో మార్కెట్లలో ఆందోళన పెరిగింది. దీనికి తోడు అమెరికా దాడుల తర్వాత వ్యూహాత్మకంగా కీలకమైన హర్మూజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించడం ఆందోళనలను మరింత తీవ్రతరం చేసింది.





# తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణపై రాజకీయ రగడ..

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఫైర్!

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 11:** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ ఇప్పుడు రాజకీయ పార్టీల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. ఈ అంశంపై బీజేపీని విమర్శిస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే



విపక్షాలు ఈ అంశాన్ని రాద్ధాంతం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. సిద్ధిపేట జిల్లా కుక్కునూరుపల్లి మండలం మత్పల్లిలో జరిగిన పార్టీ జిల్లా స్థాయి శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. గతంలో ఎస్ఐఆర్ ప్రక్రియ జరిగినప్పుడు బీజేపీ పూర్తి స్థాయిలో మద్దతు తెలిపిందని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు మాత్రం విపక్షాలు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. "కేరళ, కర్ణాటక, తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో ఈ ఓటర్ల జాబితా సవరణ జరుగుతోంది. దీని ప్రధాన ఉద్దేశం ఒక్కటే.. ఓటర్లు తమకు ఓటు హక్కు ఉన్న నియోజకవర్గాల్లోనే ఓటు వేసేలా చూడటం, పారదర్శకతను పెంచడం" అని ఆయన స్పష్టం చేశారు.

# నవంబర్‌లనే గ్రేటర్ల 'ఓట్ల పండగ'!

**దసరా ముగియంగనే మున్సిపల్ ఎన్నికల మోత.. అక్టోబర్ 1న ఫైనల్ ఓటర్ జాబితా.. 'క్యూర్' గడ్డపై జెండా పాతేందుకు కత్తులు నూరుతున్న కాంగ్రెస్..!**


**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూన్ 11:** గ్రేటర్ హైదరాబాద్, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికల పంచాయితీ నవంబర్‌లోనే తెగేటట్టు కనిపిస్తోంది. ఈ ముచ్చట మామూలుగా లేదు.. గ్రేటర్ జనాలకు నవంబర్‌లోనే ఓట్ల పండగ రాబోతుందని సర్కార్ వర్గాలలో గట్టిగ డిస్కషన్ నడుస్తోంది. ఎలక్షన్ కమీషన్ ఈ నెల 15 నుంచి మొదలయ్యే ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రోగ్రాం సెప్టెంబర్ ఆఖరుకల్లా ఖతమైపోతుంది. అక్టోబర్ 1వ తారీఖున ఫైనల్ ఓటర్ లిస్టును బయటపెడుతారు. ఆ లిస్ట్ చేతికి రాంగనే.. ఈ మూడు కార్పొరేషన్లకు ఎలక్షన్ల సైరన్ ఊదేందుకు స్టేట్ ఎలక్షన్ కమీషన్ రెడీ అవుతున్నట్లు టాక్. అందుకే మన సీఎం రేవంత్ రెడ్డి ఇప్పట్నుంచే ఆ ఏరియాలల్ల వరుసగ శంకుస్థాపనలు, ఓపెనింగులు చేస్తూ స్పీడ్ పెంచిన్రు.దసరా పండగ పొంగానే.. ఎలక్షన్ల షెడ్యూల్! ఓటర్ల జాబితా ఫైనల్ కాగానే.. కార్పొరేటర్లు, మేయర్ల రిజర్వేషన్ల లెక్క తేల్చే పని మున్సిపల్ శాఖ చూస్తుంది. ఈ తతంగం అంతా ముగిసేటందుకు కనీసం మూడు వారాల టైం పడుతది. అక్టోబర్ 18న బతుకమ్మ, 20న దసరా పండగలు ఉన్నాయి కాబట్టి.. ఆ సంబురాలు ముగియగానే ఎలక్షన్ కమీషన్ నోటిఫికేషన్ ఇచ్చే ఛాన్స్ ఉంది. నవంబర్ మొదటి లేదా రెండో వారంలోనే పోలింగ్ పెట్టేటట్టు ప్లాన్ చేస్తున్నాడని ఒక సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ లీక్ ఇచ్చాడు.

**"పండగలు ముగిశాక ఎలక్షన్ల షెడ్యూల్**

నవంబర్ మొదటి లేదా రెండో వారంలోనే ఓటింగ్ జరిగేలా గ్రౌండ్ వర్క్ జరుగుతోంది.""క్యూర్' ఏరియాలో పట్టుకోసం రేవంత్ ఫైర్!ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ముచ్చటను సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని 'క్యూర్' ఏరియాగా మార్చిండ్రు. ఆ ఏరియాను మూడు మున్సిపల్ కార్పొరేషన్లుగా విడగొట్టిండ్రు. ఇప్పుడు అక్కడ పొలిటికల్ గ్రిప్ సాధించేందుకు ఇప్పట్నుంచే వ్యూహాలు రచిస్తున్నరు. ఎందుకంటే.. ఈ మూడు కార్పొరేషన్ల పరిధిలో హస్తం పార్టీ కొంచెం వీక్గానే ఉన్నది. 2023 అసెంబ్లీ ఎలక్షన్లల్ల కాంగ్రెస్‌కు ఇక్కడ ఒక్క ఎమ్మెల్యే సీటూ రాలేదు.

ఆ తర్వాత జరిగిన కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉపఎన్నికలల్ల గెలిచినా.. పార్టీ ఇంకా గట్టిపడలేదనే టాక్ నడుస్తోంది.అందుకే సీఎం రేవంత్ డెవలప్‌మెంట్ మంత్రం ఎత్తుకున్నారు. కొత్త ఆఫీసులకు భూమి పూజలు, శంకుస్థాపనలు చేస్తూ జనాల డిమాండ్లు నెరవేరుతున్నాయి. ఇదే టైంలో అక్కడ బలంగా ఉన్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై పొలిటికల్ ఎటాక్ షురూ చేశారు. ఆ రెండు పార్టీల లీడర్లు రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటున్నారని కౌంటర్లు ఇస్తూ క్యాడర్ల జోష్ నింపుతున్నారు. మొత్తానికైతే నవంబర్‌ల రాబోయే 'గ్రేటర్ సమరానికి' కాంగ్రెస్ ఇప్పట్నుంచే కత్తి నూరుతోంది. ప్రతిపక్షాలకు గట్టి ఫైట్ ఇచ్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి పక్కా ప్లాన్‌తో ముందడుగు వేస్తున్నారు.







# కవిత కొత్త పార్టీకి పేరు చిక్కులు..

## 'టీఆర్ఎస్'పై ముప్పేట దాడి




**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 11:** కవిత ప్రతిపాదించిన కొత్త రాజకీయ పార్టీ 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్)కు ఆరంభంలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయి. పార్టీ పేరు చుట్టూ తీవ్ర వివాదం నెలకొనడంతో, ఈ అంశం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. 'టీఆర్ఎస్' అనే పేరును ఇతరులకు కేటాయించవద్దంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీఐ) పలు వైపుల నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తాయి.ఈ వివాదంలో ప్రధానంగా భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'టీఆర్ఎస్' అనే పేరు 14 ఏళ్ల తెలంగాణ ఉద్యమ చరిత్రతో, ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉందని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ తమ పార్టీని ప్రజలు 'టీఆర్ఎస్'గానే గుర్తిస్తున్నారని, కాబట్టి ఆ పేరును వేరొకరికి కేటాయించవద్దని కోరుతూ ఈసీకి అధికారికంగా ఫిర్యాదు చేసింది.మరోవైపు, కవిత పార్టీ ప్రకటనకు ఒక రోజు ముందే మహారాష్ట్ర సోలాపూర్‌కు చెందిన 'తెలంగాణ రాష్ట్రసామాజిక సేన' అనే సంస్థ కూడా 'టీఆర్ఎస్' అనే పేరు కోసం ఈసీకి దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. సోలాపూర్‌కు చెందిన దయానంద్ మహాదేవ్ మామ్‌డ్యాల్ ఈ మేరకు దరఖాస్తు చేసినట్లు తెలియవచ్చింది.

# లోక్‌సభ పునర్విభజనకు ఈఏసీ పీఎం కీలక ప్రతిపాదన

## 824కు పెరగనున్న ఎంపీ స్థానాలు!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 11:** దేశంలో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై ప్రధాని ఆర్థిక సలహా మండలి కీలక ప్రతిపాదనలు చేసింది. జనాభాను మాత్రమే ప్రాతిపదికగా తీసుకోకుండా పట్టణీకరణ, ఎస్సీ-ఎస్టీ జనాభా, భాషాపరమైన వైవిధ్యం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుని కొత్త నియోజకవర్గాల ఏర్పాటు చేపట్టాలని సూచించింది. ముఖ్యంగా చిన్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రాతినిధ్యం పెంచే లక్ష్యంతో అక్కడి లోక్‌సభ స్థానాలను రెట్టింపు చేయాలని సిఫార్సు చేసింది.



ప్రస్తుతం దేశంలో 543 లోక్‌సభ స్థానాలు ఉండగా, తాజా ప్రతిపాదనలు అమలైతే వాటి సంఖ్య 824కు చేరే అవకాశం ఉంది. పెద్ద రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉన్న సీట్లను సుమారు 50 శాతం వరకు పెంచే విధంగా మోడల్‌ను రూపొందించింది. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా 170 నియోజకవర్గాలను పునర్విభజించాలని నివేదిక పేర్కొంది. వీటిలో 59 నియోజకవర్గాలను రెండు భాగాలుగా, 111 నియోజకవర్గాలను మూడు భాగాలుగా విభజించే అవకాశం ఉందని వెల్లడించింది. కొత్త ప్రతిపాదనల ప్రకారం దక్షిణాది రాష్ట్రాల్లో కూడా ఎంపీ స్థానాల సంఖ్య గణనీయంగా పెరగనుంది. అయితే మొత్తం లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్య శాతం ప్రస్తుతం ఉన్న 23.7 శాతం స్థాయిలోనే కొనసాగించేలా ప్రతిపాదనలు రూపొందించారు. కేరళలో ప్రస్తుతం ఉన్న 20 స్థానాలు 30కు, తమిళనాడులో 39 స్థానాలు 59కు పెరిగే అవకాశం ఉంది. అలాగే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు కూడా అదనపు లోక్‌సభ స్థానాలు లభించే అవకాశముంది.



# కాంగ్రెస్ 'మాస్టర్ ప్లాన్'..

## ప్రియాంక గాంధీకి కీలక బాధ్యతలు!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 11:** దేశంలో త్వరలో జరగబోయే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఎలాగైనా విజయం సాధించి, పార్టీ జెండా ఎగురవేయాలని (పాగా వేయాలని) అధిష్టానం వ్యూహాత్మక ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. ఈ ఎన్నికల సమరంలో పార్టీని ముందుండి నడిపించేందుకు కాంగ్రెస్ అగ్రనేత, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రాకు హైకమాండ్ అత్యంత కీలకమైన బాధ్యతలను అప్పగించింది. ఉత్తరప్రదేశ్, గోవా, మణిపూర్, పంజాబ్, ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఎన్నికల వేళ రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఈ ఐదు రాష్ట్రాల్లోనూ మెరుగైన ఫలితాలు సాధించడం ద్వారా జాతీయ రాజకీయాల్లో సరికొత్త ఊపు తీసుకురావాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఇందుకోసం క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు పక్కా ప్లాన్తో ముందుకు వెళ్తోంది. ఇప్పటికే ఆయా రాష్ట్రాల్లో ప్రియాంక గాంధీ సుడిగాలి పర్యటనలు చేస్తూ శ్రేణుల్లో ఉత్సాహం నింపుతున్నారు. ముఖ్యంగా మహిళలు, నిరుద్యోగ యువతను ఆకట్టుకునేలా ప్రత్యేక హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను ఆమె భుజాన వేసుకున్నారు. రాష్ట్రాల వారీగా ఉన్న స్థానిక సమస్యలపై అధికార పక్షాలను గట్టిగా నిలదీస్తూ, కాంగ్రెస్‌కు అనుకూల పవనాలు వీచేలా క్షేత్రస్థాయి మేనేజ్‌మెంట్‌పై ప్రియాంక ప్రత్యేక దృష్టి సారించారు.



# హైదరాబాద్ పోలీసుల భారీ ఆపరేషన్..

# రూ.5వేల కోట్ల స్కామ్‌కు చెక్!

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 11:** హైదరాబాద్ పోలీసులు సుమారు రూ. 5వేల కోట్ల భారీ ఆర్థిక మోసాన్ని సకాలంలో గుర్తించి అడ్డుకున్నారు. 'ఇగ్నైట్' పేరుతో కార్యకలాపాలు సాగిస్తున్న మనీ సర్క్యులేషన్ నెట్‌వర్క్‌ను ఛేదించి, నలుగురు కీలక నిందితులను అరెస్టు చేశారు.

అమాయక ప్రజల నుంచి భారీగా నగదు వసూలు చేసేందుకు సిద్ధమైన ఈ ముఠా కుట్రను సీసీఎస్ పోలీసులు ముందే పసిగట్టారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ మీడియాకు వెల్లడించారు. ఈ వ్యవహారంలో హైదరాబాద్ పోలీసులు 'ఆపరేషన్ ఇగ్నైట్ క్రాక్‌డౌన్' పేరిట ప్రత్యేక చర్యలు చేపట్టారు. కేరళ, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. సదరు సంస్థ భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించిన కేవలం 18 రోజుల్లోనే పోలీసులు రంగంలోకి దిగి, పెను నష్టం జరగకుండా నివారించడం విశేషం.గతంలో నిషేధానికి గురైన క్యూనెట్, విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ నెట్‌వర్క్‌ల నిర్వాహకులే 'ఇగ్నైట్' పేరిట ఈ సరికొత్త మోసానికి తెరలేపినట్లు సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) దర్యాప్తులో వెల్లడైంది. గత మూడు దశాబ్దాలుగా ఈ ముఠా వరుసగా గోల్డ్ క్వెస్ట్, క్వెస్ట్‌నెట్, క్యూనెట్, తాజాగా ఇగ్నైట్ రూపంలో వివిధ పేర్లతో ప్రజలను వంచిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు బాధితులు ఫిర్యాదు చేయగా, పోలీసులు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. భారీస్థాయిలో ప్రజలు ఆర్థికంగా నష్టపోకముందే ఇలాంటి మనీ సర్క్యులేషన్ రాకెట్లను గుర్తించి, వాటిని నిర్మూలించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సీపీ సజ్జనార్ వివరించారు.

# రెవెన్యూ కార్యాలయాలకు మహర్దశ

## శాశ్వత భవనాల నిర్మాణానికి ప్రభుత్వం కీలక నిర్ణయం!

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 11:** రాష్ట్రంలో ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శకమైన పరిపాలన అందించాలనే లక్ష్యంతో ఆర్డీవో, తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార , పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ భవనాలను హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. గురువారం సచివాలయంలో తన కార్యాలయంలో రెవెన్యూ, హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐ.జి. రాజీవ్ గాంధీ హనుమంతు, హౌసింగ్ సెక్రటరీ వీపీ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.



# నిరుద్యోగులను వంచించడమే..

## 5 వేల ఉద్యోగాలతో నోటిఫికేషన్ విడుదలపై హరీశ్ రావు

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 11:** పోలీసు ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న నిరుద్యోగ యువత, ఈరోజు హైదరాబాద్‌లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు కలిసి.. నోటిఫికేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అన్యాయంపై వినతి పత్రం సమర్పించారు.

నిరుద్యోగుల ఆవేదనను సావధానంగా విన్న హరీశ్ రావు, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. నిరుద్యోగుల పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఓ ప్రెస్ నోట్ విడుదల చేశారు. తాము అధికారంలోకి వస్తే ఏటా 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని గొప్పలు




చెప్పిన కాంగ్రెస్, రెండున్నరేళ్లు గడుస్తున్నా కనీసం 20 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేకపోయిందని హరీశ్ రావు మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో ఒకేసారి 16 వేలు, 17 వేల చొప్పున భారీగా నోటిఫికేషన్లు పోలీస్ శాఖలో ఇచ్చామని, కేవలం పోలీస్ శాఖ లోనే దాదాపు 48 వేల పోస్టులు భర్తీ చేసామని ఆయన గుర్తుచేశారు.

# 49 తోమాహాక్ క్షిపణులను ఫైర్ చేసిన అమెరికా..

## వీడియో రిలీజ్ చేసిన సెంట్రల్ కమాండ్

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 11:** ఇరాన్, అమెరికా మధ్య మళ్లీ ఉద్రికత్త పెరిగింది. ఆ రెండు దేశాలు మళ్లీ పరస్పర దాడులకు దిగాయి. ఆత్మరక్షణలో భాగంగా ఇరాన్‌లోని పలు టార్గెట్లపై నిన్న 10వ తేదీన అమెరికా దాడులు చేసినట్లు సెంట్రల్ కమాండ్ చెప్పింది. అమెరికా మిలిటరీ సుమారు 49 తోమాహాక్ క్షిపణులను ఫైర్ చేసినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన వీడియోను తాజాగా యూఎస్ సెంట్రల్ కమాండ్ రిలీజ్ చేసింది. యూఎస్ఎస్ మిచ్చెల్ మర్ఫీ యుద్ధ నౌక నుంచి తోమాహాక్ క్షిపణులను ఫైర్ చేశారు. ఈ ఆపరేషన్‌ను అధ్యక్షుడు ట్రంప్ కన్ఫర్మ్ చేశారు. ఇరాన్‌లోని మిలిటరీ నిఘా కేంద్రాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, ఎయిర్ డిఫెన్స్ కేంద్రాలను ఆ క్షిపణులతో అమెరికా అటాక్ చేసింది. యూఎస్ మెరైన్ కార్ప్స్, ఎయిర్ ఫోర్స్, నేవీ .. సంయుక్తంగా ఇరానీ టార్గెట్లను పేల్చేసినట్లు సెంట్రల్ కమాండ్ తన ప్రకటనలో చెప్పింది. హోర్ముజ్‌లో అంతర్జాతీయ నౌకలకు ఇబ్బందికరంగా మారిన ఇరానీ క్షేత్రాలను టార్గెట్ చేసినట్లు అమెరికా పేర్కొన్నది. అమెరికా సేనలు నిత్యం అప్రమత్తంగా, ఆయుధ సామర్థ్యంతో ఉన్నాయని సెంట్రల్ కమాండ్ తెలిపింది.



ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.in/

# ఫుట్‌బాల్ ప్రేమికులకు పండగే.. జీ5లో ఫిఫా వరల్డ్ కప్ 2026 రచ్చ

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 11:** భారతదేశంలో ఫుట్‌బాల్ క్రేజ్ సరికొత్త శిఖరాలను తాకబోతోంది. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన క్రీడా సంబరం 'ఫిఫా వరల్డ్ కప్ 2026' జీ5 వేదికగా భారతీయ ప్రేక్షకుల ముందుకు రానుంది. జూన్ 11 నుంచే ఈ ఫుట్‌బాల్ మహాసంగ్రామానికి సంబంధించిన లైవ్ యాక్షన్, హైలైట్స్, ప్రత్యేక విశ్లేషణలు జీ5 యాప్‌లో ప్రత్యక్షం కానున్నాయి. డిజిటల్ సాంకేతికత, హై-క్వాలిటీ స్ట్రీమింగ్‌తో కోట్లాది మంది అభిమానులకు స్టేడియంలో కూర్చుని మ్యాచ్ చూస్తున్న అనుభూతిని కలిగించడానికి జీ5 అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. వివిధ రకాల డివైజ్‌ల ద్వారా ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా ఈ మ్యాచ్‌లను వీక్షించే సౌలభ్యాన్ని కల్పిస్తోంది.అలానే దీన్ని రసవత్తరంగా మార్చేందుకు జీ5 ఒక క్రేజీ అప్‌డేట్‌ను ప్రకటించింది. భారత ఫుట్‌బాల్ లెజెండ్, మాజీ కెప్టెన్ భైచుంగ్ భూటియా జీ5 ఎక్స్‌పర్ట్ ప్యానెల్‌లో చేరారు. దేశంలో ఫుట్‌బాల్ ఆటపై చెరగని ముద్ర వేసిన భూటియా.. తన సుదీర్ఘ అనుభవం, వ్యూహాత్మక చతురతతో మ్యాచ్‌లకు సంబంధించిన లోతైన విశ్లేషణలను అభిమానులకు అందించనున్నారు.ఇక ఆలస్యం ఎందుకు... ఇయ్యాల్టి నుండి జీ5 స్క్రీన్లపై మీ ఫేవరెట్ జట్ల 'ఫిఫా' సమరాన్ని చూసి ఎంజాయ్ చేయండి..!







## కూర్చొని గ్లామర్ షోతో హెబ్బా పటేల్..

### చూపు తిప్పుకోలేని అందాలతో...

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్11:** హెబ్బా పటేల్ గురించి ప్రత్యేకంగా సినీ ప్రేమికులకు పరిచయం అవసరం లేదు. ఈ బ్యూటీ 2014లో విడుదలైన 'తిరుమనం ఎనుం నిఖా' అనే తమిళ చిత్రంతో తన సినీ ప్రయాణాన్ని ప్రారంభించింది.అయితే ఆమె నటించిన కన్నడ చిత్రం 'అధ్యక్ష' ముందుగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అదే ఏడాది 'అలా ఎలా' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన హెబ్బా, 2015లో విడుదలైన 'కుమారి 21ఎఫ్' మూవీతో ఒక్కసారిగా భారీ గుర్తింపును సంపాదించుకుంది. హెబ్బా సినిమాల్లోనే కాదు, సోషల్ మీడియాలో కూడా తన గ్లామర్ షోతో అభిమానులను అలరిస్తూ ఉంటుంది. తాజాగా హెబ్బా పటేల్ లైట్ యెల్లో కలర్ శారీలో స్టన్నింగ్ లుక్‌లో దర్శనమిచ్చింది. అందుకు తగిన స్లీవ్‌లెస్ బ్లౌజ్ ధరించి, స్టైలిష్‌గా కుర్చీలో కూర్చొని తన అందాలు హైలైట్ అయ్యేలా ఫోటోలకు పోజులు ఇచ్చింది.



## మరోసారి పూజా హెగ్డేకు షాక్..

### ఆశలన్నీ గల్లంతు

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్11:** కొన్ని సంవత్సరాల క్రితం తెలుగు సినీ పరిశ్రమలో స్టార్ హీరోయిన్‌గా తిరుగులేని ఇమేజ్‌ను సంపాదించుకున్న పూజా హెగ్డే, ప్రస్తుతం వరుస పరాజయాలతో కెరీర్‌ను కొనసాగిస్తోంది. 'అల వైకుంఠపురంలో' చిత్రంతో భారీ బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకున్న ఈ బ్యూటీకి ఆ తర్వాత మాత్రం ఆశించిన స్థాయిలో విజయాలు దక్కలేదు. తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో సినిమాలు చేస్తున్నప్పటికీ సరైన హిట్ మాత్రం అందుకోవడం లేదు. తాజాగా పూజా హెగ్డే, వరుణ్ ధావన్ హీరోగా తెరకెక్కిన 'హై జవానీ తో ఇష్క్ హోనా హై' రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌లో హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమాపై పూజా హెగ్డే భారీ ఆశలు పెట్టుకోవడంతో పాటు ప్రమోషన్స్‌లో కూడా చురుగ్గా పాల్గొంది.అయితే జూన్ 5న విడుదలైన ఈ చిత్రానికి బాక్సాఫీస్ వద్ద గొప్ప టాక్ రాకపోవడంతో కలెక్షన్లపై ప్రభావం పడినట్లు తెలుస్తోంది. మూవీపై ఎన్నో ఆశలు పెట్టుకున్న పూజా హెగ్డేకు మరోసారి నిరాశే ఎదురైనట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇక ఈ చిత్రంలో మరో హీరోయిన్‌గా నటించిన మృణాల్ ఠాకూర్‌కూ ఈ సినిమా ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



## పూనమ్ రాజ్‌పుత్ గ్లామర్ షో..

### పోరగాళ్లు నిద్ర లేకుండా చేస్తోందిగా..

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్11:** మోడల్‌గా కెరీర్‌ను ప్రారంభించి నటిగా మంచి గుర్తింపును సంపాదించుకున్న వారిలో పూనమ్ రాజ్‌పుత్ ఒకరు. పలు టెలివిజన్ కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు వాణిజ్య ప్రకటనల ద్వారా కూడా ప్రేక్షకులకు చేరువైంది.అంతేకాకుండా పంజాబీ మ్యూజిక్ వీడియోల్లో కనిపించి తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుంది. సోషల్ మీడియాలో ఎంతో యాక్టివ్‌గా ఉండే ఈ ముద్దుగుమ్మ తరచూ తన గ్లామరస్ ఫోటోలను అభిమానులతో పంచుకుంటూ ఉంటుంది.దీంతో ఆమె పోస్టులు క్షణాల్లో వైరల్ అవుతుండగా రోజురోజుకూ ఫాలోవర్ల సంఖ్య కూడా పెరుగుతోంది. తాజాగా పూనమ్ రాజ్‌పుత్ తన సోషల్ మీడియా ఖాతాలో కొన్ని స్టన్నింగ్ ఫోటోలను షేర్ చేసింది.



## చూపులతో మత్తెక్కిస్తున్న మిర్నా మీనన్.. క్యూట్ ఫోటోలు వైరల్..

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్11:** ఉగ్రం, క్రేజీ ఫెలో, నా సామిరంగ, జైలర్.. లాంటి పలు తమిళ్, తెలుగు సినిమాలతో మెప్పించిన మలయాళీ భామ మిర్నా మీనన్ లేటెస్టుగా షార్ట్ డ్రెస్ లో హాట్ హాట్ ఫోజులతో ఉన్న ఫోటోలను షేర్ చేసింది..




## 2027 ఇయర్ నుంచి వచ్చా..

### బతికుండేది నేనొక్కడినే.. టైమ్ ట్రావెలర్ హల్చల్!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 11:** సోషల్ మీడియాలో తాము భవిష్యత్తు నుంచి వచ్చామని చెప్పుకునే వ్యక్తులు అప్పుడప్పుడూ వైరల్ అవుతుంటారు. తాజాగా 'జావియర్' అనే వ్యక్తి కూడా అలాంటి వాదనతో నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాడు. తాను 2027 సంవత్సరం నుంచి ప్రస్తుత కాలానికి వచ్చానని, త్వరలో భూమిపై భారీ విపత్తు సంభవించి ప్రపంచం అంతరించిపోతుందని చెబుతున్నాడు. టిక్‌టాక్, యూట్యూబ్ వేదికలపై వీడియోలు పోస్ట్ చేస్తున్న జావియర్.. తానే ఈ ప్రపంచంలో చివరి మనిషినని పేర్కొంటున్నాడు. అతడు షేర్ చేస్తున్న వీడియోల్లో సాధారణంగా జనంతో కిటకిటలాడే స్టేడియాలు, షాపింగ్ మాల్స్, నగర వీధులు పూర్తిగా ఖాళీగా కనిపిస్తాయి.
ఆ నిర్మానుష్య ప్రాంతాల్లో జావియర్ ఒంటరిగా తిరుగుతూ కనిపించడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. అయితే ఈ వీడియోలపై నెటిజన్లలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు నిజమేనని నమ్ముతుండగా, మరికొందరు ఇది ఎడిటింగ్ మాయాజాలమేనని చెబుతున్నారు. తెల్లవారుజామున లేదా లాక్‌డౌన్ సమయంలో చిత్రీకరించిన వీడియోలకు గ్రాఫిక్స్ జోడించి ఉండొచ్చని సాంకేతిక నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.



## ఒక్కడే మొగుడు.. 39 మంది పెండ్లాలు..! తినడానికే రోజుకి...?

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్11:**
ఇప్పుడు 39 మంది భార్యలు, 94 మంది పిల్లలతో మొత్తం 200 మందిలో ఒకే కుటుంబంపై ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఒకే కుటుంబంలో ఇంత మంది ఉండటం ఆశ్చర్యపోతున్నారు. భారతదేశంలో నివసిస్తున్న ప్రపంచంలోనే అతిపెద్ద కుటుంబం ఇది. మిజోరంలోని బక్తావంగ్ గ్రామానికి చెందిన జియోనా చానా ఈ మహా సామ్రాజ్యానికి అధిపతి. మిజోరంలో బహుభార్యాత్వాన్ని ఆచరించిన ఒక వ్యక్తికి ప్రపంచంలోనే అతిపెద్ద కుటుంబం ఉంది. 2021లో తన 76వ ఏట కన్నుమూసిన జియోనా చానా, 39 మంది భార్యలు, 94 మంది పిల్లలు,33 మంది మనవడు/మనవరాళ్లతో కూడిన తన భారీ కుటుంబానికి పెద్దగా వ్యవహరించారు. ఆ భారీ కుటుంబం'న్యూ జనరేషన్ హౌస్' అని పిలిచే 100 గదులున్న నాలుగు అంతస్తుల ఇంట్లో కలిసి నివసిస్తోంది.

గడిచిన సంవత్సరాలలో ఈ అసాధారణమైన కుటుంబం అంతర్జాతీయ మీడియా, డాక్యుమెంటరీ దర్శకులు, ప్రపంచవ్యాప్త పర్యాటకుల దృష్టిని ఆకర్షించింది. ప్రతిరోజూ పెద్ద మొత్తంలో ఆహారం తయారు చేస్తారు. ఇంటి పనులు కుటుంబ సభ్యుల మధ్య విభజించడంతో ఎవరి పనులు వారు చేసేస్తుంటారు.

కొందరు వంటలో సహాయం చేస్తే, మరికొందరు వ్యవసాయం, శుభ్రపరచడం, నిర్వహణ, ఇతర బాధ్యతలను చూసుకుం టారు.కేవలం వంటగదిని చూస్తేనే సందర్శకులు ఆశ్చర్యపోతారు. ఆ కుటుంబం ప్రతిరోజూ 45-90 కిలోల బియ్యంతో పాటు, సుమారు 40 కిలోల బంగాళాదుంపలు, 25 కిలోల కూరగాయలు, 20 కిలోల పప్పుధాన్యాలు వండుతారని నివేదికలు సూచిస్తున్నాయి. ఇక మాంసాహార వంటకాల విషయానికొస్తే.. 30-35 కోళ్లు అవసరం కావచ్చు.



## రామ్‌చరణ్ పెద్ది మూవీ వారం రోజుల కలెక్షన్ ఎంతంటే?


**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్11:** మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ నటించిన పెద్ది మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను సాధిస్తోంది. జూన్ 4న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది ఈ చిత్రం. ఈ మూవీ రిలీజ్ అయిన ఏడు రోజుల్లో 345 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించింది. ఈ విషయాన్ని చిత్రం బృందం సోషల్ మీడియా వేదికగా ఓ స్పెషల్ పోస్టర్ ద్వారా తెలియజేసింది.రామ్‌చరణ్ నటన, గ్రామీణ నేపథ్యం, క్రీడల అంశాలు, ఎమోషనల్ కంటెంట్ ఉండడంతో ఈ చిత్రానికి ప్రేక్షకుల బ్రహ్మరథం పడుతున్నారు. ఈ చిత్రం మరో రెండు లేదా మూడు రోజుల్లో 400 కోట్ల క్లబ్‌లో చేరుతుందని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 11:** క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు జీవితంలో భారీ మూల్యాన్నే చెల్లించుకునేలా చేస్తాయి. తాజాగా అలాంటి ఘటనలో ఓ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. నాటుకోడి కూర కోసం మొదలైన వివాదం చిలికి చిలికి గాలివానలా మారి చివరకు తండ్రి ప్రాణం తీసింది. జనగామ జిల్లా తరిగొప్పుల మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన జంగిలి రమేశ్ (42), అనుషా భార్యభర్తలు. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో నాటు కోడిని తీసుకువచ్చి కోస్తాను కూర వండమని భార్య అనుషను అడిగాడు. అందుకు ఆమె ఇవాళ అంగట్లో చేపలు తీసుకువచ్చి వండానని, కోడిని రేపు ఉదయం కోసుకుందామని సర్ది చెప్పే ప్రయత్నం చేసింది. అయితే భార్య మాటలకు ఆగ్రహంతో రగిలిపోయిన రమేశ్ అనూషను బూతులు తిట్టసాగాడు.ఈ క్రమంలో అమ్మను ఎందుకు తిడుతున్నావంటూ ఇంట్లో ఉన్న కొడుకు గణేశ్ తండ్రికి అడ్డుతగిలాడు. దీంతో కొడుకును సైతం రమేశ్ తిట్టడంతో తండ్రి మాటలతో ఆగ్రహావేశానికి లోనైన గణేశ్ పక్కనే ఉన్న రోకలి బండతో తండ్రి తలపై బలంగా బాదాడు. ఈ ఘటన తీవ్రంగా గాయపడిన రమేశ్ ను స్థానికులు జనగామ ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రమేశ్ బుధవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.




## ఆ స్టార్ నిర్మాత చేతికి 'ఫౌజీ' హిందీ థియేట్రికల్ హక్కులు

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్11:** రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం 'ఫౌజీ' చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమాలో ఇమాన్వీ హీరోయిన్‌గా నటిస్తుండగా, హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఈ ఏడాది అక్టోబర్‌లో విడుదల చేయాలని మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన మాత్రం ఇంకా వెలువడలేదు. ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ క్రేజీ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'ఫౌజీ' చిత్రానికి సంబంధించిన హిందీ థియేట్రికల్ హక్కులను బాలీవుడ్ స్టార్ నిర్మాత అనిల్ తాడని భారీ ధరకు దక్కించుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.హిందీ మార్కెట్‌లో ఆయనకు మంచి పట్టు ఉండటంతో, ఈ సినిమాకు భారీ స్థాయిలో థియేటర్లు లభించే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి. అలాగే సినిమా మంచి టాక్‌ను సొంతం చేసుకుంటే హిందీ బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్లు సాధించే అవకాశం కూడా ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు.



ON BEHALFOF RRR MEDIA PRIVATE LIMITED. 2-3-603/49A, PATELNAGAR, AMBERPET, HYDERABAD.TELNGANA 500013..
EDITOR:RAMAN RAJU RATHNA.RNI NO:TG/2024/1093, Email:ramannews9@gmail.com Phone:9949152838,7013794396